క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో నేడు (శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేశి మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, ఎస్ఆర్ నగర్, 100 ఫీట్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

పార్కింగ్ చేసిన బైక్‌ల చోరీ



కాజీపేట : కాజీపేట పట్టణంలో ఇంటి ఆవరణలో పార్క్ చేసిన పలు ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడం చర్చనీయాంశంగా మారింది. బాధితుల కథనం ప్రకారం గురువారం తెల్లవారుజామున ఇళ్లలోకి ప్రవేశించి పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేశారు. జూబ్లీమార్కెట్‌లో ఫొటోగ్రాఫర్ రాయిస్‌కు చెందిన బైక్, సోమిడిలో రైల్వే ఉద్యోగికి చెందిన ద్విచక్రవాహనం, విష్ణుపురిలో గౌని సాంబయ్య స్కూటీతో దొంగలు పరారయ్యారు. గౌని సాంబయ్య ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసి సోమిడిలో వదిలేసి పోయారు. దొంగల కదలికలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో క్రైంపోలీసులు వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

వరంగల్ : ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మద్యానికి బానిసై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ ఎ.రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌కు చెందిన జక్కోజు శివకృష్ణచారి (31) కూలీ పని చేస్తూ మద్యానికి బానిసై రోజు ఇంట్లో భార్యతో గొడవ పడేవాడని అన్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం మృతుడి భార్య, తల్లి ఇంటి ఎదుట ఉండగా అతిగా మద్యం తాగి వచ్చి ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడని చెప్పారు. అయితే నిద్రిస్తున్నాడని అనుకుని కొద్దిసేపటి తర్వాత తలుపులు తీయకపోతే కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య లావణ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాఘవేందర్ వివరించారు.

సట్టా స్థావరంపై దాడి

- రూ.6,330ల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం, కేసు నమోదు

ఖిలా వరంగల్ : ఆన్‌లైన్‌లో రహస్యంగా ఆడుతున్న సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి రూ.6,330ల నగదు, స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి పడమరకోట పద్మశాలి వీధిలో ఓ ఇంట్లో ఆన్‌లైన్ సట్టా రహస్యంగా ఆడుతున్నట్లు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ రాజు గురువారం సాయంత్రం సట్టా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కామని హరీశ్‌ను అదుపులోకి తీసుకుని, అతని నుంచి రూ.6,330ల నగదు, స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హరీశ్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు కేసును అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

కానరాని అభివృద్ధి

- గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేక రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



అంబేడ్కర్ కాలనీలో అస్తవ్యస్త డ్రెయినేజీతో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

మడికొండ: గ్రేటర్ వరంగల్ పరిధి మడికొండలోని 64వ డివిజన్‌లోని పలు కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎప్పుడో నిర్మించిన రోడ్లు ధ్వంసమయ్యాయి. అభివృద్ధి చేయాలని కోరినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

హిల్స్ కాలనీలో కాల్వలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు గుంతలుపడి అధ్వానంగా ఉన్నాయని చెబుతున్నారు. అంబేడ్కర్ నగర్‌లో 20 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్ల ఆనవాళ్లు కూడా కనిపించడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ ధ్వంసమై పోయింది. మురుగు నీరు ముందుకు సాగక నిల్చిపోవడంతో పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. దాంతో తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినాయక నగర్ కాలనీలో మురుగునీరు రోడ్లపై నిలవడంతో నడవడానికి సైతం కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్ కాలనీలో సదుపాయాలు కల్పించాలి



సర్పంచ్‌ల పాలనలో వేసిన రోడ్లు ధ్వంసం అయిపోయాయి. సైడ్ డ్రెయినేజీలు సైతం పూర్తిగా చెడిపోయాయి. దాంతో మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది అనారోగ్యం బారిన పడుతున్నాం. కాలనీలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

– అంకేశ్వరపు రమేష్, స్థానికుడు

మురుగు నీరు ఇళ్లలోకి వస్తోంది

మసీదు వద్ద డ్రెయినేజీలో మురుగు నీరు నిలుస్తోంది. ఆ నీరు రోడ్డుపై పారుతూ ఇళ్లల్లోకి వస్తోంది. వర్షాల కారణంగా దుర్వాసనతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఉన్నతాధికారులు, పాలకులు చొరవ చూపి సదుపాయాలను మెరుగుపర్చాలి.

– ఎస్‌కే.ఫారూఖ్, స్థానికుడు



కేడీసీ పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డి, బీజేపీ నాయకులు



ఇస్లామియా కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద..



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ఉపాధ్యాయుడు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతం

వరంగల్, హనుమకొండ నగర పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఆయా కేంద్రాల్లో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఓటింగ్ సరళిని పరిశీలించారు. అభ్యర్థుల మద్దతు దారులు పోలింగ్ చీటీలను అందజేయగా ఉపాధ్యాయులు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లా కళాశాలలో ఓటింగ్ సరళిని పరిశీలించి వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజ్ యాదవ్



కేడీసీలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



హసన్‌పర్తి: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు



కేడీసీ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లు

ముస్లింల సంక్షేమానికి పెద్దపీట

- వైభవంగా ఉర్సు షరీఫ్ ఉత్సవాలు
- దర్గాను దర్శించుకున్న టీపీసీసీ కార్యదర్శి ఎండీ అయూబ్, దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్



దర్గాలో పూజలు చేస్తున్న అయూబ్, జబ్బార్

ఖిలా వరంగల్ : ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీపీసీసీ కార్యదర్శి ఎండీ అయూబ్, ఖాసీం షాహిద్, దర్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ అన్నారు. గురువారం వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఏకశిలా నగర్‌లోని హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసీం షాహిద్ దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మసీద్ నుంచి పురవీధుల్లో జెండాను ఊరేగిస్తూ మతాలకు అతీతంగా ముస్లింలు నృత్యాలు, ఫకీర్ల విన్యాసాలు చేయగా.. సందల్ ఊరేగింపు నిర్వహించారు. దర్గా అధ్యక్షుడు జబ్బార్ గంధం, జెండాను ఊరేగింపుగా తీసుకొస్తుండగా ముస్లింలు ఎదురేగి మొక్కలు సమర్పించుకున్నారు. ముస్లిం మతపెద్దలు మహ్మద్ నౌమాన్ రజా సమాధికి గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సహకారాలతో దర్గా అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం దర్గా కమిటీ బాధ్యులు మహా అన్నదానం నిర్వహించారు.ఎండీ ముగ్దుం, ఎండీ అష్రఫ్, ఆరీఫ్, చంద్‌పాషా, మాషూక్, సర్వర్, సాలార్, హైమద్‌ఖాన్, హజారొద్దిన్, హుస్సేన్ అలీబేగ్, దస్తగిరి, జానీ, ఖాజా, ముంతాజ్, సలాయొద్దిన్, రఫీక్, జమీల్, యాకూబ్, అమ్జద్, షర్ఫొద్దిన్, ఫసీ, భక్తులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలు వద్దు



రేష్మిత మృతికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

- అసోసియేట్ డీన్–2 ఎం.వెంకట్‌రెడ్డి

వరంగల్ : విద్యార్థులు క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలతో ప్రాణాలు తీసుకోవద్దని అసోసియేట్ డీన్–2 ఎం.వెంకట్‌రెడ్డి విద్యార్థులను కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో బీఎస్సీ(హానర్) అగ్రికల్చర్ చదువుతున్న విద్యార్థి జి.రేష్మిత కోర్సుపై అయిష్టంతో తల్లిదండ్రులకు దూరంగా ఉండడం భరించలేక క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని ఎం.వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయ కళాశాలలో రేష్మిత ఆత్మశాంతి కలగాలంటూ సంతాపసభను నిర్వహించారు. సభలో అధ్యాపకులు డాక్టర్ సల్ల సౌజన్య, హేమశరత్, బి.విద్యాధర్, హారిక మాట్లాడారు. అనంతరం రేష్మిత చిత్రపటానికి అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పుష్పాలతో శ్రద్ధాంజలి ఘటించి రెండు నిముషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జనార్దన్‌రావు సేవలు గుర్తించాలి

- ట్రస్ట్ కార్యదర్శి బుచ్చి బాబురావు



జనార్దన్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బుచ్చి బాబురావు తదితరులు

కేయూ క్యాంపస్ : ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు సేవలను ప్రభుత్వం గుర్తించాలని జనార్దన్‌రావు ట్రస్టు కార్యదర్శి తక్కెళ్లపల్లి బుచ్చిబాబురావు కోరారు. గురువారం ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనార్దన్‌రావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న ప్రొఫెసర్ జనార్దన్‌రావు విగ్రహానికి బుచ్చిబాబురావు ఇతర బాధ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జనార్దన్‌రావు సేవలను గుర్తించి స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జనార్దన్ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 23ఏళ్లుగా దేశంలోని ప్రముఖ మేధావులతో జనార్దన్‌రావు స్మారక ఉపన్యాసాలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు తూముల అభిలాష్‌రావు, ఎల్ఐసీ డెవలప్‌మెంటు ఆఫీసర్ భిక్షపతి నాయక్, సత్యం, ప్రకాశ్‌రావు, డాక్టర్ రాజేష్, టి.వినీల్, డాక్టర్ వీరస్వామి, యతిరాజారావు, జగదీశ్, విజయ్‌కుమార్, హిమసాయి తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై అగ్నిగుండాలు



మడికొండ: మెట్టుగుట్టపై అగ్నిగుండం దాటుతున్న భక్తులు

మడికొండ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మెట్టుగుట్టపై ఏర్పాటు చేసిన అగ్నిగుండాలను భక్తులు దాటారు. గురువారం తెల్లవారు జామున వీరశైవ మహేశ్వరులు మురళీధర్, అంబాల, కొలనుపాక సంతోష్‌కుమార్, లేదల్ల వీరభద్రస్వామి పల్లెం, అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు. భక్తులు అగ్నిగుండం నుంచి నడవడానికి పోటీపడ్డారు. చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఆలయ కార్యనిర్వహణధికారి కే.శేషుభారతి, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస, బోగి కేదారి పాల్గొన్నారు. ఆలయాన్ని కాశీ పీఠాధిశులు శివనాగేంద్ర సరస్వతి స్వామిజీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ఖిలా వరంగల్ : మహాశిరాత్రి పర్వదినం సందర్భంగా ఖిలావరంగల్ మధ్యకోట స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయం, కరీమాబాద్ రోడ్డులోని బొమ్మలగుడిలోని కాశీవిశ్వేశ్వర, ఫోర్ట్‌రోడ్డులోని శివవిఘ్నేశ్వర, శివనగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి మహాఅన్న పూజ నిర్వహించారు.

ముగిసిన అన్నాభిషేకం..

కాజీపేట : కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలో కొలువుదీరిన సంతాన లింగేశ్వర స్వామికి అర్చకులు అన్నాభిషేకం నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణం ముగిసిన అనంతరం లింగోద్భవ పూజలు చేపట్టారు. 'కుడా' చైర్మన్ వెంకట్రామి రెడ్డి, కార్పొరేటర్ రవీందర్ యాదవ్, గౌతమ్ పాల్గొన్నారు.

భక్త మార్కండేయ ఆలయంలో మహాన్నదానం

కాజీపేట 62వ డివిజన్ సోమిడిలోని భక్త మార్కండేయ దేవాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోటేశ్వర్ మహాన్నదానం నిర్వహించారు.



వినతిపత్రం అందజేత



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న తమను కాంట్రాక్టు అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబుతో పాటు తదితరులు వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రంను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. రెగ్యులర్ కోర్సుల్లో పనిచేస్తున్న 79మంది, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న 57మంది పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, పార్ట్ టైం అధ్యాపకుల సంఘం బాధ్యులు తిరుణహరిశేషు, దేవోజీనాయక్, రాజేందర్, భిక్షపతి, బాలకృష్ణ, శ్రీధర్, ఎర్రబొజ్జు రమేష్, శంకర్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గెలుపు అవకాశాలు'

హన్మకొండ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి గెలుపు అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. గురువారం హనుమకొండలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని వారు పరిశీలించారు. స్థానిక నాయకులను పోలింగ్ తీరును అడిగి తెలుసుకున్నారు.

నామినేటెడ్ పదవి కేటాయించాలని వినతి

కాజీపేట రూరల్ : షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం జాతీయ కార్యదర్శి, దళితరత్న పసునూరి మనోహర్‌కు ఎస్సీ కమిషన్ మెంబర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లేదా రాష్ట్రస్థాయిలో ఏదైనా నామినేటెడ్ పదవి కేటాయించాలని పలువురు నాయకులు ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలి


హన్మకొండ : ఎమ్మెల్యేల కోటాలో బీసీలకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సీఎంకు రాసిన లేఖను గురువారం హనుమకొండలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. సామాజిక న్యాయంలో భాగంగా రెండు బీసీలకు మరో రెండు సంచారజతులకు అవకాశం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా చట్టసభల్లో, నామినేటెడ్ పదవుల్లో ఈ రెండు సామాజిక వర్గాలకు న్యాయం జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ నాయకులు దారాబోయిన సతీష్, ఎర్రబొజ్జ రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

'ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి'

వరంగల్ లీగల్ : ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని న్యాయవాది, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్.. మాజీ మంత్రి హరీశ్‌రావును కోరారు. ఈ మేరకు ఇటీవల హనుమకొండకు వచ్చిన హరీశ్‌రావును కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. తన సేవలను గుర్తించి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.

ఎన్నిక



వరంగల్ చౌరస్తా : వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ వి 101 ఏ, వాసవీ క్లబ్ వరంగల్ (కోడ్ 621) నూతన కార్యవర్గాన్ని క్లబ్ భవన్‌లో గురువారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తోనుపునూరి వీరన్న, ప్రధాన కార్యదర్శిగా గన్ను సంపత్ కుమార్, కోశాధికారిగా ఉప్పుల వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు బాధ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు బెలిదె వెంకటేశ్వర్లు, మాజీ సెక్రటరీ గార్లపాటి శ్రీనివాసులు, ప్రతినిధులు గుంటూరు వెంకటనారాయణ, పాలారపు కృష్ణమూర్తి, శ్రీరామ్ భిక్షపతి, నాగేందర్, ప్రకాశ్‌రావు, మల్యాల వీర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు విరాళం

నయీంనగర్ : వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ (వాటా) సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాలను నేడు (శుక్రవారం) సైన్స్ డే సందర్భంగా విరాళంగా ఇస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు కర్ర శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పింగిలి రమాదేవి, కె.వేణుగోపాల్, ఎ.మధుకర్ రెడ్డి, కీర్తి తేజారెడ్డి, గంట విజయాదేవి తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ



హన్మకొండ చౌరస్తా : హనుమకొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉపాధ్యాయురాలు వెలిదండి సుమలత పుస్తకాలు వితరణ చేశారు. ఈ మేరకు గురువారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్‌కు పుస్తకాలను అందజేశారు. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నేషనల్ బుక్ ట్రస్ట్‌లో శాశ్వత సభ్యత్వాన్ని కల్పిస్తూ రూ.10 వేల విలువైన పుస్తకాలను సుమలతకు పంపించారు. సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఖిలా వరంగల్ : తూర్పుకోటకు చెందిన ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ నానమ్మ మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ గురువారం మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధితులను పరామర్శించారు. అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట : కాజీపేట పట్టణంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పెయింటింగ్ యూనియన్ సభ్యులు 'ఆకలి కేకలు' వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజారపు రాజు ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేసి పెయింటర్లకు పంపిణీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికులు తరలి వస్తుండటంతో స్థానిక పెయింటర్లు ఉపాధి లేక ఆకలి కేకలు పెడుతున్న విషయాన్ని పోస్టర్లలో ముద్రించారు. ఈ కార్యక్రమంలో మేకిల రాజేందర్, ఎండీ షబ్బీర్, గబ్బెట ఎల్లేష్, కొండా శ్రీకాంత్, సతీష్, రాజు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేయూలో వర్క్‌షాప్

కేయూ క్యాంపస్ : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో నేడు (శుక్రవారం) ఉదయం 10:30గంటలకు సెనేట్‌హాల్‌లో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మనోహర్ గురువారం తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కాకతీయ యూనివర్సిటీలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెంటర్ ఆధ్వర్యంలో వరంగల్ మెడికవర్ ఆస్పత్రి సహకారంతో నేడు (శుక్రవారం) ఉదయం 7:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సమ్మక్క ఉమెన్స్ హాస్టల్ వద్ద మహిళల కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్టూడెంట్స్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు ఆర్టీసీ సమ్మె సన్నాహక సమావేశం

హన్మకొండ : ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో నేడు (శుక్రవారం) సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ కన్వీనర్ ఎం.శ్రీనివాస్ వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో వరంగల్ రీజియన్ జేఏసీ సమ్మె సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నృత్య కళాకారులకు ప్రశంసలు

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి వివిధ నృత్యకళా సంస్థలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ వారిని అభినందించి మాట్లాడుతూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జాగరణ చేస్తున్న భక్తుల కోసం ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయని ఈ సందర్భంగా చిన్నారులను ప్రశంసించారు.



